గ్రంథాలయంలో సమస్యల తిష్ట

- మాక్లూర్‌లో నాసిరకంగా లైబ్రరీ భవన నిర్మాణం
- నీటిసౌకర్యంలేక నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఇబ్బందుల్లో పాఠకులు



మాక్లూర్ మండల కేంద్రంలోని గ్రంథాలయం



గ్రంథాలయంలోకి చేరిన వర్షపు నీరు (ఫైల్)

మాక్లూర్: మండలకేంద్రంలోని జిల్లా గ్రంథాలయం సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శాఖ గ్రంథాలయంలో సమస్యలు తిష్టవేశాయి. 7వేల 674 పుస్తకాలు ఉన్న ఈ గ్రంథాలయంలో రోజు 100 నుంచి 150 మంది పాఠకులు సందర్శిస్తుంటారు. దీంతో పాఠకులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాక్లూర్‌లోని గ్రంథాలయం 1985 నుంచి 2022 వరకు అద్దె భవనంలో కొనసాగింది. గ్రంథాలయానికి సొంత భవనం కోసం 2005లో ప్రభుత్వం రూ.16,60,000 నిధులు మంజూరు చేసింది. దీంతో 2005లో పనులను ప్రారంభించి, 2022లో పూర్తిచేయగా, అదే సంవత్సరం డిసెంబర్ 6న లైబ్రరీ నూతన భవనంలోకి మారింది. కానీ భవన నిర్మాణ పనులు నాసికరంగా చేపట్టడంతో సమస్యలు మొదలయ్యాయి. డోర్లు, కిటికీలు సరిగా ఏర్పాటుచేయకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి సౌకర్యం కల్పించకపోవడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. 2016 నుంచి టీవీని అటుకెక్కించారు. ఇందేంటని గ్రంథపాలకుడు నరేష్‌రెడ్డిని ప్రశ్నిస్తే షటాప్ బాక్సు ఇవ్వనప్పుడు తానేం చేస్తానని సమాధానం చెప్పుతున్నట్టు పాఠకులు తెలిపారు. చిన్నవర్షం కురుస్తే చాలు బయటి నీరంత భవనంలోనికి నీరుతుందని పాఠకులు వాపోతున్నారు. .

బోరుమోటారు నిధులు మాయం?.

గ్రంథాలయం ఆవరణలో బోరు మోటారు కోసం మంజూరైన రూ.2,20,000 ఏమయ్యాయన్న విషయం చర్చనీయాంశంగా మారింది. 2022 ఆగస్టులో గ్రంథాలయ ప్రాంగణంలో బోరు తవ్వి, మోటారు ఏర్పాటు కోసం నిధులు మంజూరు కాగా, ఇప్పటివరకు బోరు తవ్వించలేదు.. మోటారు పెట్టలేదు. మంజూరైన డబ్బులు మాత్రం మాయం అయ్యాయి. ఈక్రమంలో 2023 ఏప్రిల్ 3న బిల్డింగ్ అన్ని విధాల సౌకర్యంగా ఉందంటూ లెటర్ ఇవ్వాలని సంబంధిత అధికారి నుంచి గ్రంథాలయ పాలకుడికి ఓ లెటర్ కూడ వచ్చినట్టు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పాఠకులు కోరుతున్నారు.



గ్రంథాలయంలోని పుస్తకాలు

టీవీ లేదు..

గ్రంథాలయం అసంతృప్తిగా ఉంది. వర్షం పడితే బయటినీరంత లోపలికి వస్తుంది. ప్రధాన డోర్లు ఇప్పటికే పగిలిపోతున్నాయి. టీవీ లేదు. బోరుబావి లేక బాత్‌రూంలు వృథాగా మారాయి. ఇప్పటికై న సంబంధిత అధికారులు స్పందించాలి.

–మహ్మద్ ఆరిఫ్, పాఠకుడు, మాక్లూర్

మిషన్ భగీరథ కనెక్షన్ ఇప్పించాం

లైబ్రరీకి గ్రామ పంచాయతీ నుంచి మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇప్పించాం. నీటి సమస్యలేదు. మిగితా సమస్యలేమైన ఉంటే త్వరలో చేయిస్తాను. గ్రంథాలయ ప్రాంగణంలో బోరు బావి తవ్వకం, మోటారు పెట్టుటకు 2022లో రూ: 2లక్షల 20వేలు మంజూరైన మాట వాస్తవమే. అది కూడ త్వరలో చేయించి సమస్యలు లేకుండా చూస్తాను.

–బుగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

క్లుప్తంగా

హోంమంత్రిపై ఫిర్యాదు



మోర్తాడ్: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీపై కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఒక కార్యక్రమంలో తన గన్‌మెన్‌ను హోంమంత్రి చెంపదెబ్బకొట్టడాన్ని ఆగ్రహిస్తూ, ఫిర్యాదు చేశారు. నాయకులు వేణుగోపాల్ యాదవ్, ముత్యాల రాములు, నసీర్, ఇంతియాజ్, అశోక్, భోగ రమేష్, చిన్నయ్య, శంకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

10న నందిపేట్ మండల సర్వసభ్య సమావేశం

నందిపేట్: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి నందిపేట, డొంకేశ్వర్ మండలాల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కులసంఘాలకు నిధుల ప్రొసీడింగ్స్ అందజేత



మాక్లూర్: ఆర్మూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన రజక, వడ్డెర సంఘాలకు నిధులకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అందజేశారు. నాయకులు శ్రీకాంత్, ప్రసాద్, రాకేష్, రాజేందర్, నితిన్, ఎల్లయ్య, గంగాధర్, రాజు, అచ్యుత్, ఎర్రన్న సాయినాథ్ పాల్గొన్నారు.

9న కాన్షీరాం వర్ధంతి సభ



బోధన్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతి సభను ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా ఇన్‌చార్జి గైని గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. వర్ధంతి సభకు రాజ్య సభసభ్యుడు ఎంపీ రాంజీ గౌతం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లు హాజరు కానున్నారని తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం హరిత శనివారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు విజ్ఞత, హిమతేజ, సాయిచరణ్, రిషిప్రియ, అండర్–17 విభాగంలో నిషిత రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. దీంతో శనివారం వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ మంజుల సుధాకర్ అందజేశారు. నాయకులు శిలారీ సుధాకర్, నవీన్, ధనలక్ష్మి, మల్లేష్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



రుద్రూర్: మండల కేంద్రంలో శ్రీసార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో శనివారం వరసిద్ధి వినాయక 73 వార్షికోత్సవ పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాఅన్నదానం ఏర్పాటు చేశారు. గణేష్ మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

60ఏళ్ల అభివృద్ధిని తొమ్మిదేళ్లలో చేశాం

- బోధన్ ఎమ్మెల్యే షకీల్
- రూర్బన్ పనులు ప్రారంభం



మినీ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షకీల్

ఎడపల్లి(బోధన్): నియోజకవర్గంలో 60ఏళ్లలో చేయలేని అభివృద్ధిని గత తొమ్మిదేళ్లలో చేశామని బోధన్ ఎమ్మెల్యే షకీల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో రూర్బన్ పథకం కింద నిర్మించిన మినీ స్టేడియం, క్లస్టర్ కమ్యూనిటీ హాల్, ఫిష్ మార్కెట్, పశు వైద్యశాల, మార్కెట్ షెడ్, హెల్త్ సెంటర్, గ్రంథాలయ భవనలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు ప్రాంరంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ రజితయాదవ్, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ ఆకుల మాధవి, ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, పోలా మల్కారెడ్డి, ఇమ్రాన్ ఖాన్, బాబా, మనీషా పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీలను అమలుచేయండి



బోధన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

బోధన్‌టౌన్(బోధన్): కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకులు మల్లేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం బల్దియా అధికారులకు సమ్మె పత్రాన్ని అందించారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పిస్తానని ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీని అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు పర్వయ్య, గంగారాం, సీతారాం, శంకర్, మరియమ్మ, సైదమ్మ, పార్వతి, సంజీవ్, రాజు, లావణ్య, కళావతి కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరిస్తాం



బోధన్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

బోధన్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తామని పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకుడు, కేకేసీ నేషనల్ కో–ఆర్డినేటర్ కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు పట్టణంలో శనివారం పథకాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోధన్ సెగ్మెంట్‌లో పార్టీ టికెట్ ఎవరికి వచ్చిన గెలుపు కోసం కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. కరుణాన్న యువసేన ద్వారా కుమ్మన్‌పల్లి ఆర్మీ జవాన్ కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు. నాయకులు శంకర్‌నాయుడు, ఖాజా ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ అంత్యక్రియలకు ఆర్థికచేయూత



ఆర్మీ జవాన్ అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందిస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

బోధన్: సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ ఇటీవల సిక్కిం వరదల్లో గల్లంతై మృతిచెందాడు. జవాన్ అంత్యక్రియలను ఆదివారం ఆయన స్వగ్రామంలో నిర్వహించనుండగా, బాధిత కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే షకీల్ రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా అందించారు. తహసీల్దార్ మమత, ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, వైస్‌చైర్మన్ ఎండీ షకీల్, బీఆర్ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, గోగినేని నరేంద్ర బాబు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



బాల్కొండ మండల సమావేశంలో ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సభ్యులు

బాల్కొండ: బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ యమాగంటి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. గత సమావేశంలో తీర్మానించిన పనుల వివరాలను , ప్రస్తుతం చేపట్టాల్సిన పనులను గురించి చర్చించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో డెంగీ జ్వరాలు అధికంగా సోకుతున్నాయన్నారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో చేతికందిన మక్క, సోయా పంటల దిగుబడులకు మద్దతు ధర దక్కేలాచర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన బాల్కొండ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సన్మానించారు. జెడ్పీటీసీ దాసరి లావణ్య, వైస్ఎంపీపీ శ్రీకాంత్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల వినూత్న నిరసన



కోటగిరి/ఆర్మూర్‌టౌన్: తమ సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన(ఎండీఎం) కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 18వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా కోటగిరిలో ఎండీఎం కార్మికులు వినూత్నరీతిలో నిరసన తెలపారు. ఒంటికాలిపై నిలబడి ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఆర్మూర్‌లోనూ కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన చేపట్టారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని వారు పేర్కొన్నారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఉన్నారు.

కొనసాగుతున్న ఆశావర్కర్ల సమ్మె





కోటగిరిలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశా కార్యకర్తలు.. రెంజల్‌లో..

రుద్రూర్/వర్ని/రెంజల్/కోటగిరి: తమ సమస్యల పరిష్కారం కోసం ఆశావర్కర్లు చేపట్టిన సమ్మె శనివారం 13వ రోజు కొనసాగింది. కోటగిరిలో ఆశావర్కర్ల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు ప్రకటించారు. మంత్రి కేటీఆర్ ఇటీవల ఆశావర్కర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. వర్నిలో ఆశా వర్కర్లు సమ్మె శిబిరం నుంచి ఖాళీ ప్లేట్లు వాయిస్తూ ర్యాలీ నిర్వహించారు. సమ్మెకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విఠల్ మద్దతు తెలిపారు.



వర్నిలో ప్లేట్లను వాయిస్తున్న ఆశా వర్కర్లు

మోస్రాలో ఆశాకార్యకర్తలు గాడిదకు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు సన్మానం



బాల్కొండ: ముప్కాల్‌లో కానిస్టెబుల్‌గా ఎంపికైన అభ్యర్థులను శనివారం బీజేపీ నాయకులు సన్మానించారు. ఎంపీటీసీ పద్మ, నాయకులు సంతోష్, చిలుక దినేష్, ముస్కు నర్సయ్య, గోపినాథ్, నర్సయ్య, రవికిరణ్, రమేష్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



సుర్బిర్యాల్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ పస్క నర్సయ్య

పెర్కిట్(ఆర్మూర్)/ఆర్మూర్‌టౌన్/బోధన్/బోధన్ టౌన్(బోధన్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్, చేపూర్, సుర్బిర్యాల్ గ్రామాల్లో శనివారం బతుకమ్మ చీరలను స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. సుర్బిర్యాల్‌లో ఎంపీపీ పస్క నర్సయ్య, మహిళలకు చీరలను అందజేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, నిధుల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఆర్మూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత బతుకమ్మ చీరలను మహిళలకు అందజేశారు. సాలూర మండలంలోని మందర్నా గ్రామంలో యువతకు క్రీడాసామగ్రిని, మహిళలకు బతుకమ్మ చీరలను ఎంపీపీ బుద్దెసావిత్రి రాజేశ్వర్, సర్పంచ్ రావుబాగంగాధర్ తదితరులు పంపిణీ చేశారు. బోధన్‌లో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆయేషా వెల్ఫేర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఆయేషా ఫాతిమా చీరలను పంపిణీ చేశారు.



ఆర్మూర్ పట్టణంలో..

కుట్టు మిషన్‌ల పంపిణీ



భీమ్‌గల్: మండలకేంద్రంలో న్యాక్ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్, ధ్రువీకరణ పత్రాలను ఐఐఎఫ్‌హెచ్‌డబ్ల్యూ చైర్మన్ మధుశేఖర్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుశేఖర్ మాట్లాడుతూ.. సెంటర్ ద్వారా ఇప్పటి వరకు 1476 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. డైరెక్టర్ సత్యపాల్ రెడ్డి, ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్, సెంటర్ ఇనచార్జి దిలీప్ శ్రీకృష్ణ, రుచిత, ఓంకార్, దీపక్ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభం



వేల్పూర్: మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులను శనివారం బీఆర్ఎస్ నాయకులు, జీపీ పాలకవర్గం ప్రారంభించారు. ముస్లిం కాలనీలో డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. సర్పంచ్ తీగెల రాధామోహన్, ఉపసర్పంచ్ పిట్లసత్యం, బబ్బూరు ప్రతాప్‌రెడ్డి, నోముల రవీందర్,వెంకటేశ్‌గౌడ్, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



బాల్కొండ: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థిని మైథిలి సౌత్ జోన్స్ సబ్ జూనియర్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి భవాని తెలిపారు. ఈమేరకు శనివారం పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు. త్వరలో తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరు

నవీపేట: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా లేరని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతామని కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. నవీపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆయన శనివారం కాంగ్రెస్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం పింఛన్లతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను పెంచిందన్నారు. కుటుంబపాలన కొనసాగిస్తున్న సీఎం కుటుంబీకులు అక్రమంగా రూ.లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు. నాయకులు తాహెర్, గడుగు గంగాధర్, సుధాకర్‌రావ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, రాంచందర్, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్, ప్రదీప్‌రావ్, కోటిరెడ్డి, కిరన్, బాబు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ది ఎక్సార్సిస్ట్(ఇంగ్లీష్) – 11.25, 2.00, 7.35 ; మంత్ ఆఫ్ మధు (తెలుగు) 4.35 మామా మశ్చీంద్ర (తెలుగు) – 10.10
స్క్రీన్-2 –	మ్యాడ్(తెలుగు)–12.20, 6.40, 9.30 స్కంద (తెలుగు) – 3.10
స్క్రీన్-3 –	రూల్స్ రంజన్(తెలుగు) – 12.00, 6.40, 10.00 ; 800(తెలుగు) – 03.20
స్క్రీన్-4 –	మామా మశ్చీంద్ర (తెలుగు)– 11.40 ; జవాన్ (తెలుగు) 2.50 ; స్కంద – 6.15 ; చిన్నా (తెలుగు) 9.45

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో శనివారం మాదిగల యుద్ధభేరి సభ కరపత్రాలను ఎమ్మార్పీఎస్ టీఎస్ ప్రతినిధులు శ్రీనివాస్, గుండారం మోహన్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 23న హైదరాబాదులో మాదిగల యుద్ధభేరి నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు కార్యక్రమానికి తరలివచ్చి జయంప్రదం చేయాలని కోరారు. నాయకులు చిలుముల పోసాని, మోతే భూమన్న, దేవన్న, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు

జెడ్పీలో ఆర్వోప్లాంట్ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని జెడ్పీ కార్యాలయానికి డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 1లక్ష నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. శనివారం జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు ప్లాంట్‌ను ప్రారంభించారు. జెడ్పీ సీఈఓ గోవింద్, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అవార్డు



ఖలీల్‌వాడి: నగరంలోని కలెక్టరేట్‌లో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం(మ్యాడుల్‌క్యాంపు) నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సామాజిక రంగాలలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్‌కు ఉత్తమ అవార్డు అందుకున్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి సామ్‌కోషి ఆమెకు అవార్డును అందజేశారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

బోధన్: ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న పట్టణంలోని విజయమేరి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎంసీ చైర్మన్ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన ఎంఆర్‌సీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.